సాక్షి రంగారెడ్డి

శనివారం । 17 । జూన్ । 2023



భూ నిర్వాసితులకు పరిహారం

కల్వకుర్తి ఎత్తిపోతలలో భాగంగా భూములు కోల్పోయిన రైతులకు నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తెలిపారు. 8లో▸



ముఠా గుట్టు రట్టు

పశువులను అక్రమంగా గోవధకు తరలిస్తున్న 13 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 8లో▸



సబ్సిడీ యూరియా పట్టివేత

రైతులకు సబ్సిడీపై అందించాల్సిన యూరియాను అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

హరగోపాల్‌పై దేశ ద్రోహం కేసును ఎత్తివేయాలి

షాద్‌నగర్: ప్రొఫెసర్ హరగోపాల్‌పై పోలీసులు పెట్టిన దేశ ద్రోహం కేసును వెంటనే ఎత్తివేయాలని కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినబాక ప్రభాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రముఖ విద్యావేత్త, ప్రొఫెసర్ హరగోపాల్‌పై ములుగు జిల్లా తాడ్వాయి పోలీస్ స్టేషన్‌లో పోలీసులు దేశ ద్రోహం కేసు నమోదు చేయడం సరికాదని అన్నారు.మావోయిస్టు లతో సంబంధాలు ఉన్నాయనే సాకుతో కేసులు నమోదు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజాస్వామిక వాదిపై కేసులు పెట్టడం అన్యాయమని అన్నారు. ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని తక్షణమే కేసులను ఉపసంహరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

మజీద్‌పూర్‌కు ఐఎస్‌ఓ సర్టిఫికెట్



అబ్దుల్లాపూర్‌మెట్ : నీటి సమృద్ధి విభాగంలో మండలంలోని మజీద్‌పూర్ గ్రామ పంచాయతీకి ఐఎస్‌ఓ సర్టిఫికెట్ లభించింది. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నగరంలోని రవీంద్రభారతిలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో మంత్రులు కేటీఆర్, జగదీష్‌రెడ్డి, దయాకర్‌రావు చేతుల మీదుగా గ్రామ సర్పంచ్ పోచంపల్లి సుధాకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఎస్‌కే జమీల్ సర్టిఫికెట్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయిలో తమ గ్రామానికి గుర్తింపు రావడం సంతోషంగా ఉందన్నారు. గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసి ఆదర్శంగా నిలుపుతామన్నారు.

దేశానికే రోల్ మోడల్‌గా తెలంగాణ

సీఐఐ–సీఎఫ్‌ఓ కాన్‌క్లేవ్‌లో మంత్రి హరీశ్‌రావు

సనత్‌నగర్: తెలంగాణ రాష్ట్రం దేశానికే రోల్ మోడల్‌గా అవతరించిందని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) తెలంగాణ ఆధ్వర్యంలో 'సీఎఫ్‌ఓ కాన్‌క్లేవ్–2023' నాల్గో ఎడిషన్ శుక్రవారం బేగంపేట ఐటీసీ కాకతీయ హోటల్‌లో శుక్రవారం జరిగింది. 'ట్రాన్స్‌సెండింగ్ న్యూ ఫ్రాంటియర్స్:టెక్నాలజీ, సస్టేనబులిటీ అండ్ గవర్నెన్స్' థీమ్‌తో కొనసాగిన కాన్‌క్లేవ్‌కు ముఖ్యఅతిథిగా హాజరైన హరీశ్‌రావు మాట్లాడుతూ ఏ సంస్థకైనా సీఎఫ్‌ఓలు వెన్నెముక లాంటివారన్నారు. ఎప్పటికప్పుడు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాంకేతికపరంగా ప్రావీణ్యం సాధించాలన్నారు. ఆయా సంస్థలను సీఎఫ్‌ఓలు బలోపేతం గత తొమ్మిదేళ్లలో తెలంగాణ గర్వించదగ్గ అభివృద్ధి సాధించిందన్నారు. ముఖ్యంగా రూ.40 వేల కోట్లతో పటిష్టమైన విద్యుత్ పంపిణీ వ్యవస్థను ఏర్పాటుచేసి గృహాలు, పరిశ్రమలకు నిరంతర విద్యుత్ సరఫరాను అందించగలుగుతున్నామన్నారు. సీఐఐ తెలంగాణ సీఎండీ, సీఎస్‌ఆర్ ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కార్పొరేట్ నిపుణులు, సీఎఫ్‌ఓలు అధునాతన టెక్నాలజీని స్వీకరించాలన్నారు. సైబర్ భద్రతాపరంగా మరిన్ని పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. పావెస్టోన్ క్యాపిటల్ మేనేజింగ్ పార్టనర్ లక్ష్మీకాంత్, డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్ లిమిటెడ్ డిప్యూటీ సీఎఫ్‌ఓ ఎంవీ నరసింహం, కాన్సార్క్ కో–కన్వీనర్ ఆనంద్ దగా, గ్లోబల్ టెక్నాలజీ సర్వీసెస్ ఎండీ ప్రవీణ భీమవరపు పాల్గొన్నారు.



అందంగా.. ఆకాశ వంతెన

ఉప్పల్ జంక్షన్ అందంగా..ఆకర్షణీయంగా మారింది. ఇక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న స్కైవాక్ వంతెన నిర్మాణం తుది దశకు చేరుకుంది. పాదచారుల భద్రత, సౌకర్యమే లక్ష్యంగా ఏర్పాటు చేస్తున్న ఈ వంతెనకు ఎన్నో ప్రత్యేకతలున్నాయి. దీంతో ఈ ప్రాంతం ఇప్పుడు సోషల్‌మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఆకర్షణీయమైన ఫొటోలు, వీడియోలు చక్కర్లు కొడుతున్నాయి. మెట్రో పాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్‌ఎండీఏ) ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న స్కైవాక్ వంతెన నిర్మాణానికి దాదాపు వెయ్యి టన్నుల బ్రాండెడ్ స్టీల్ వినియోగించారు. మొత్తం ఎనిమిది మెట్ల దారులు, ఎనిమిది లిఫ్టులు, నాలుగు ఎస్కలేటర్లు ఉన్నాయి. ప్రతి దారి వద్ద గ్రీనరీని అభివృద్ధి పరిచారు. వంతెన పైభాగం ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. మెట్రో ప్రయాణికులకు సైతం అనుకూలంగా ఉండేలా చేశారు.

– ఉప్పల్

సిబ్బంది కొరత.. రైతులకు వెత



కూరగాయల సాగు

- ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖలో పోస్టులు ఖాళీ
- ఉండాల్సిన అధికారులు 38 మంది.. ఉన్నది 9 మందే
- రైతులకు అందని సలహాలు, సూచనలు

చేవెళ్ల: ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖలో సిబ్బంది కొరత వేధిస్తోంది. కొనేళ్లుగా ఉద్యాన, పట్టుపరిశ్రమ రైతులకు సరైన సలహాలు, సూచనలు కరువయ్యాయి. ప్రభుత్వం అందించే రాయితీలు, పథకాలు సక్రమంగా అందటం లేదు. ఏడాది పొడవునా జిల్లాలో దాదాపు 72వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. ఉన్న ఐదు రెవెన్యూ డివిజన్లు 27 మండలాలకు సంబంధించి ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ పరిధిలో 38 మంది ఉండాల్సి ఉండగా 9 మంది మాత్రమే పనిచేస్తున్నారు. 29 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

రైతులకు అవగాహన కరువు

ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు గ్రామ స్థాయిలో సరైన అవగాహన ఉండటం లేదు. ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై కూరగాయల విత్తనాలు, డ్రిప్ ఇరిగేషన్‌తోపాటు మామిడి,అరటి, బొప్పాయి, నారింజ, జామ, దానిమ్మ తదితర పండ్ల తోటలు పెంచేందుకు ప్రోత్సహించాల్సి ఉంది. సాగులో అవసరమైన మెలకువలను ఉద్యానశాఖ అధికారులు అందించాల్సి ఉంటుంది. సరిపడా అధికారులు లేకపోవటంతో పంటల సాగుకు ముందుకు వస్తున్నా రైతులకు ప్రోత్సాహం కరువైంది. ఏటా సీజన్ల వారీగా సాగుపై అవగాహన కల్పించాల్సి ఉంటుంది. కొన్నేళ్లుగా వాటి ఊసే లేదు. కనీసం అధికారులను కూడా కలిసే పరిస్థితి లేకుండాపోయింది.

క్షేత్రస్థాయిలో నలుగురే ..

జిల్లాలో ఉన్న 27 మండలాలను పర్యవేక్షించేందుకు క్షేత్రస్థాయిలో ఉద్యాన, పట్టుపరిశ్రమశాఖకు నలు గురే అధికారులు ఉన్నారు. ఒక్కో మండలానికి ఒక్కో అధికారి ఉండాల్సి ఉండగా ఈ రెండు శాఖ లు చూసుకునేందుకు నలుగురు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. మిగతా ఐదుగురు జిల్లా కార్యాలయంలో పనిచేస్తున్నారు. దీంతో వారాని కోరోజుకూడా ఒక మండలానికి కేటాయించలేని పరిస్థితి నెలకొంది. ఇబ్రహీంపట్నం డివిజన్ పరిధిలోని అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్, మంచాల, ఇబ్రహీంపట్నం, యాచారం, మాడ్గుల, బాలాపూర్, సరూర్‌నగర్, శేరిలింగంపల్లి మండలాలకు బి.కనకలక్ష్మి అనే అధికారి ఒక్కరే ఉన్నారు. షాద్‌నగర్ డివిజన్ పరిధిలోని షాద్‌నగర్‌తోపాటు కేశంపేట, కొత్తూరు, నందిగామ, చౌదరిగూడ, కొందుర్గు, తలకొండపల్లి మండలాల బాధ్యతలు ఉషారాణికి ఉన్నాయి. చేవెళ్ల డివిజన్ అధికారి అశోక్‌కు చేవెళ్ల మండలంతోపాటు మొయినాబాద్, శంకర్‌పల్లి, షాబాద్, రాజేంద్రగనగర్, గండిపేట, ఆమనగల్లు, కడ్తాల్, మండలాలు ఉన్నాయి. సౌమ్య అనే అధికారికి శంషాబాద్, మహేశ్వరం, కందుకూరు మండలాల బాధ్యతలు ఉన్నాయి. ఒక్కో అధికారికి తలకు మించిన భారం కావడంతో పూర్తిస్థాయిలో న్యాయం చేయలేకపోతున్నారు. ఇప్పటికైనా పోస్టులు భర్తీ చేసి అధికారులను కేటాయించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

జిల్లాలో ఉద్యాన, పట్టుపరిశ్రమశాఖలో పోస్టుల వివరాలు

అధికారులు	మంజూరు పోస్టులు	పనిచేస్తున్నవి	ఖాళీలు
జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమశాఖ అధికారి	01	01	00
ఉద్యానశాఖ అసిస్టెంట్ డైరెక్టర్	02	02	00
హార్టికల్చర్ అధికారులు	05	04	01
పట్టు పరిశ్రమ అధికారులు	01	01	00
అసిస్టెంట్ పట్టుపరిశ్రమ అధికారులు	03	01	02
టెక్నికల్ అధికారులు	08	00	08
టెక్నికల్ అసిస్టెంట్ అధికారులు	18	00	18
మొత్తం	38	09	29

ఉన్నతాధికారులకు నివేదించాం



సిబ్బంది కొరత కారణంగా రైతులకు నేరుగా ఫోన్‌ల ద్వారా వాట్సాప్ గ్రూప్ ద్వారా కావాల్సిన సలహాలు, సూచనలు అందిస్తున్నాం. ఖాళీ పోస్టుల వివరాలు ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన వెంటనే ఈ పోస్టులు భర్తీ అవుతాయి. అప్పటి వరకు రైతులకు ఇబ్బంది లేకుండా ఉన్న సిబ్బంది ఫోన్‌లలో అందుబాటులో ఉన్నారు. సందేహాలుంటే రైతులు నేరుగా ఫోన్‌చేసి నివృత్తి చేసుకోవచ్చు.

– సునందారెడ్డి, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి



జూన్‌లోనూ 'రికార్డు' విద్యుత్ వినియోగం

ఎండలు తగ్గక పెరిగిన వాడకం

సాక్షి, రంగారెడ్డి జిల్లా: సాధారణంగా రోహిణి కార్తె ముగిసి మృగశిర కార్తెలోకి ప్రవేశించిన తర్వాత పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుముఖం పడుతుంటాయి. కానీ ప్రస్తుతం నగరంలో 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండకు ఉక్కపోత కూడా తోడవడంతో సిటిజన్లు అల్లాడుతున్నారు. ఉపశమనం కోసం ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలను వాడుతున్నారు. ఫలితంగా గ్రేటర్‌లో విద్యుత్ వినియోగం రికార్డుస్థాయిలో నమోదవుతుంది. గత ఏడాది జూన్‌తో పోలిస్తే..ప్రస్తుతం రోజు సగటు విద్యుత్ వినియోగం పది ఎంయూలకుపైగా నమోదవుతుండటం ఆందోళన కలిగిస్తుంది. శుక్రవారం అత్యధికంగా 74 ఎంయూలకుపైగా విద్యుత్ వినియోగం నమోదు కావడం విశేషం. వర్షాలు కురిసి వాతావరణం చల్లబడితే కానీ..వినియోగం తగ్గే అవకాశం లేదు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే..సరఫరా వ్యవస్థపై భారం తప్పదు.

తరచూ షార్ట్‌సర్క్యూట్లు

కేవలం గృహ విద్యుత్ మాత్రమే కాదు వాణిజ్య, పారిశ్రామిక వినియోగం కూడా రెట్టింపైంది. అపార్ట్‌మెంట్లు, వ్యక్తిగత భవనాలు, వాణిజ్య సముదాయ భవ నాల నిర్మాణ సమయంలో భవిష్యత్తు అవసరాలను అంచనా వేయకుండా విద్యుత్ వైరింగ్ పనులు చేపట్టారు. ప్రస్తుతం ప్రతి ఇంట్లోనూ, వాణిజ్య సముదా యంలోనూ ఏసీ అనివార్యమైంది. విద్యుత్ గృహోపకరణాలు కూడా రెట్టింపయ్యాయి. వస్తువుల నిష్పత్తి మేరకు పిన్‌ప్లగ్‌లు, సాకెట్‌లు, స్విచ్ బోర్డులు ఏర్పా టు చేయలేదు. విధిలేని పరిస్థితుల్లో ఒకే పిన్‌ప్లగ్ నుంచి మల్టీ(కంప్యూటర్, టీవీ, ఫోన్ ఛార్జర్, ఏసీ, కూలర్, రిఫ్రిజిరేటర్ వంటి) ఎలక్ట్రానిక్స్ వాడుతు న్నారు. వైరింగ్ సామర్థ్యాని కి మించి విద్యుత్ వినియోగిస్తుండటంతో వేడికి జాయింట్ల వద్ద షార్ట్‌సర్క్యూట్ తలెత్తుతుంది. ఈ సమయంలో నిప్పు మినుగురులు పక్కనే ఉన్న వస్తువులకు అంటుకుని భారీగా మంటలు ఎగిసిపడుతున్నాయి. ప్రస్తుతం నగరంలో వెలుగు చూస్తున్న మెజార్టీ అగ్ని ప్రమాదాలకు ఇదే కారణమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

నగరంలో విద్యుత్ వినియోగం ఎంయూల్లో..

తేదీ	2022	2023
12	60.00	70.49
13	65.00	72.79
14	62.02	73.88
15	60.69	73.95
16	60.12	74.02

పాలనా వికేంద్రీకరణతోనే మెరుగైన సేవలు



వార్డు కార్యాలయ ప్రారంభోత్సవంలో మంత్రి సబితారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా

- మంత్రి సబితారెడ్డి

హుడాకాంప్లెక్స్: పరిపాలన వికేంద్రీకరణతోనే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడం సాధ్యమని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అభిప్రాయపడ్డారు. సరూర్‌నగర్ మండల కేంద్రంలో శుక్రవారం ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తాతో కలిసి సరూర్‌నగర్ వార్డు (19) కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పౌర సేవలను మరింత వేగవంతం చేసేందుకే ప్రభుత్వం వార్డు కార్యాలయాలను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. వార్డు కార్యాలయానికి అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ స్థాయి అధికారి ఇన్‌చార్జిగా, పది మంది అధికారుల బృందం వివిధ శాఖల నుంచి పనిచేస్తారని అన్నారు. అధికారులను నియమించడంతో పాటు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా ప్రతి మున్సిపాలిటీ పరిధిలో డంపింగ్ యార్డు, వైకుంఠధామాలు, నర్సరీలు, పట్టణ ప్రకృతి వనాలను ఏర్పాటు చేసుకొని పరిశుభ్రత, పచ్చదనాన్ని పెంపొందించడం జరిగిందన్నారు. ఎంపీ రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. భవిష్యత్తు తరాలను దృష్టిలో పెట్టుకుని వచ్చే 50 ఏళ్లలో తాగునీటి కొరత రాకుండా ముఖ్యమంత్రి ప్రణాళిక రూపొందించారని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, జోనల్ కమిషనర్ పంకజ, డిప్యూటీ కమిషనర్ హరికృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

అప్సర హత్య కేసులో సీన్ రీ కన్‌స్ట్రక్షన్



అప్సర మృతదేహాన్ని పాతిపెట్టిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

- నిందితుడు సాయికృష్ణకు రెండు రోజుల కస్టడీ

శంషాబాద్ రూరల్: అప్సర హత్య కేసులో పోలీసులు శుక్రవారం సీన్ రీ కన్‌స్ట్రక్షన్ నిర్వహించారు. కోర్టు అనుమతితో నిందితుడు అయ్యగారి వెంకట సూర్య సాయి కృష్ణను రెండు రోజుల కస్టడీకి తీసుకున్న శంషాబాద్ పోలీసులు మరిన్ని ఆధారాలు సేకరించారు. మండల పరిధిలోని సుల్తాన్‌పల్లి శివార్లలోని బ్యూటీగ్రీన్ పక్కన ఉన్న గోశాలకు సాయికృష్ణ తరచూ వచ్చేవాడు. హత్య జరిగిన రోజు అతను అప్సరతో కలిసి అక్కడికి వచ్చాడు. గోశాలలో రక్తం చిందిస్తే పాపం చుట్టుకుంటుందని భావించిన సాయికృష్ణ అక్కడి నుంచి కారులో తిరిగి శంషాబాద్ వైపు బయలుదేరాడు. గోశాల నుంచి దాదాపు రెండు కిలో మీటర్ల దూరం వెళ్లిన తర్వాత నర్కూడ సమీపంలో శంషాబాద్–షాబాద్ రోడ్డు పక్కన ఉన్న వెంచర్‌లో అప్సర తలపై రాయితో మోది హత్య చేశారు. సీన్ రీ కన్‌స్ట్రక్షన్‌లో భాగంగా పోలీసులు నిందితుడు సాయికృష్ణను గోశాల, వెంచర్ వద్దకు తీసుకెళ్లి ఆధారాలు సేకరించారు. వెంచర్ సమీపంలో చిన్న బండరాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి రాళ్లగూడ, శంషాబాద్ బస్టాండ్ ప్రాంతాల్లోని సీసీ కెమెరాల్లో రికార్డ సీసీ టీవీ ఫుటేజీని కూడా పోలీసులు సేకరించారు. సరూర్‌నగర్ మండల కార్యాలయం వెనకాల అప్సర మృతదేహాన్ని పాతిపెట్టిన ప్రాంతానికి కూడా నిందితుడిని తీసుకెళ్లిన పోలీసులు ఆధారాలు సేకరించారు. ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్ కుమార్ నేతృత్వంలో ఈ రీ కన్‌స్ట్రక్షన్ నిర్వహించారు. ఇదిలా ఉండగా పోలీసు కస్టడీ ముగియడంతో నిందితుడు సాయి కృష్ణను శనివారం కోర్టులో హాజరుపర్చనున్నారు.

సూత్ర ఫ్యాషన్ ఎగ్జిబిషన్ ప్రారంభం

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణా హోటల్‌లో శుక్రవారం సూత్ర ఫ్యాషన్ ఎగ్జిబిషన్ ప్రారంభమైంది. సినీతారలు డాక్టర్ కామాక్షి భాస్కర్ల, డాక్టర్ సుధాజైన్ ఈ ప్రదర్శనను ప్రారంభించారు. ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్న ప్రదర్శనలో దేశవ్యాప్తంగా ప్రఖ్యాతి చెందిన డిజైనర్లు తమ ఉత్పత్తులను ప్రదర్శించారు. సంప్రదాయ, ఆధునికతను మేళవించుకున్న దుస్తులు, ఆభరణాలు ఈ ప్రదర్శనలో కనువిందు చేస్తున్నాయి. బ్రైడల్‌వేర్ ప్రత్యేకతగా ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా ప్రఖ్యాతి చెందిన పిటార, అలంకృత్, కలర్స్ ఫ్యాబ్, బాబి అలియా, రష్మీ డ్రెస్సెస్ జైపూర్ తదితర దుస్తులు ఇక్కడ కనువిందు చేస్తున్నాయి.



జంట హత్యల కలకలం

- నందిగామలో దారుణం

నందిగామ: జంట హత్యలు కలకలం రేపిన ఘటన రంగారెడ్డి జిల్లా నందిగామలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. నందిగామకు చెందిన మధురాపురం కృష్ణ, శశికళ దంపతుల కూతురు భానుప్రియ (9) స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. వరసకు నానమ్మ అయిన ఎర్రగారి పార్వతమ్మ (75) వేరే ఇంట్లో ఒంటరిగా ఉంటుండంతో ఆమె తోడుగా రోజూ రాత్రివేళ ఆమెతోపాటే పడుకుంటుంది. యథావిధిగా గురువారం రాత్రి కూడా వెళ్లింది. శుక్రవారం సాయంత్రమైన భానుప్రియ ఇంటికి రాకపోవడంతో తల్లి పార్వతమ్మ ఇంటికి వెళ్లింది. ఎంత పిలిచినా ఎవరూ పలకక పోవడంతో కిటికిలో నుంచి చూడగా ఇద్దరూ రక్తం మడుగులో పడి కనిపించారు. దీంతో స్థానికులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి తలుపులుబద్ధలు కొట్టి చూడగా భానుప్రియ విగత జీవిగా పడి ఉంది. పార్వతమ్మ అపస్మారకస్థితిలో పడిఉంది. భానుప్రియ చేతికి, మెడపై తీవ్రగాయాలు ఉండగా, పార్వతమ్మ తలకు గాయాలు కనిపించాయి. విషయం తెలిసిన ఇన్‌స్పెక్టర్ రామయ్య సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. వృద్ధురాలిని షాద్‌నగర్‌లోని కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



బాలిక మృత దేహం, పక్కన పడిఉన్న వృద్ధురాలు పార్వతమ్మ

అద్దెకొచ్చిన వారే.. హత మార్చారా?

కాగా, బీహార్‌కు చెందిన కొంత మంది పార్వతమ్మ ఇంట్లో గురువారం అద్దెకు దిగారని, శుక్రవారం సాయంత్రం ఖాళీ చేసి వెళ్లిపోయారని, వారే ఈ పని చేసి ఉంటారని స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు. గదిలో బీరువా తలుపులు తెరిచిఉండటం అనుమానాలకు తావిస్తోంది. ఒకవేళ దొంగతానికి వస్తే వృద్ధురాలి పక్కనే కుర్చీలో బంగారు గుండ్లు, కాళ్ల కడియాలు ఎలా వదిలి వెళ్తారనే ప్రశ్నలు ఉద్భవిస్తున్నాయి. ఘటనా స్థలాన్ని శంషాబాద్ డీసీపీ నారాయణ రెడ్డి పరిశీలించారు. క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ.. హంతకులను వీలైనంత త్వరలో పట్టుకునేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు.

దంపతుల అదృశ్యం


సంతోష్/సంధ్య (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: దంపతులిద్దరూ అదృశ్యమయ్యారు. భానూర్–బీడీఎల్ ఎస్‌ఐ మహేశ్వర్ రెడ్డి కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం నందిగామకు చెందిన సంధ్య వివాహం.. చేవెళ్ల మండలం కొరికుంట్ల గ్రామానికి సంతోష్‌తో జరిగింది. సంతోష్ సదాశివపేట ఎంఆర్ఎఫ్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. వారంరోజుల క్రితం సంధ్య తల్లిగారింటికి వచ్చింది. బంధువుల వద్ద శుభకార్యం ఉండటంతో సంతోష్ కూడా అత్తగారింటికి వచ్చాడు. ఈ క్రమంలో 15న సాయంత్రం దంపతులిద్దరూ బైక్‌పై వెళ్లారు. ఎంతకూ ఇంటికి రాకపోవడంతో లక్ష్మి తన కూతురు, అల్లుడుకు ఫోన్ చేయగా ఇద్దరి ఫోన్లు స్విచ్చాఫ్ వచ్చాయి. తెలిసినా వారికి ఫోన్ చేసినా ఆచూకీ లభించలేదు. తన కూతురు, అల్లుడు అదృశ్యం అయ్యారంటూ లక్ష్మి ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

కద్తాల్: మండల పరిధిలోని మక్తమాధారం గ్రామంలో ఓ వ్యాపారి వద్ద అక్రమంగా నిల్వ ఉన్న రేషన్ బియ్యాన్ని ఎస్‌ఓటీ పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు. మక్తమాధారం గ్రామానికి చెందిన మహ్మద్ బాబా, పేద ప్రజల వద్ద రేషన్ బియ్యం కొనుగోలు చేసి, వ్యాపారం నిర్వహిస్తున్నారు. అందిన పక్కా విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్‌ఓటీ పోలీసులు శుక్రవారం వ్యాపారిపై ఇంటిపై దాడులు నిర్వహించి, అతని ఇంట్లో అక్రమంగా నిల్వ ఉన్న రెండు క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు బియ్యం వ్యాపారి బాబా పై కేసు నమోదు చేసినట్లు సమాచారం.

భూ నిర్వాసితుల కోసం రూ.16.34 కోట్లు మంజూరు

కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన డీ82 కాలువ నిర్మాణంలో ఆమనగల్లు, మాడ్గుల, మండలాలలో భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం రూ.16.34 కోట్లు మంజూరు చేసిందని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ ద్వారా రంగారెడ్డి జిల్లా కలెక్టర్ పీడీ అకౌంట్‌లో జమ అయినట్లు, ఒకటి రెండు రోజులలో రైతుల ఖాతాలలో జమ చేస్తారని ఆయన చెప్పారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు బాంధవుడని చెప్పారు. కేఎల్ఐ డీ 82 కాలువ నిర్మాణంలో నాగర్‌కర్నూల్ జిల్లాలోని వెల్దండ, కల్వకుర్తి మండలాల రైతులకు సంబంధించి ఇప్పటికే రూ.26 కోట్లు అందించామన్నారు. ఆమనగల్లు, మాడ్గుల మండలాల రైతులకు ప్రస్తుతం నిధులు మంజూరయ్యాయని ఆయన చెప్పారు. రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు మనుగడ లేదని ఆయన చెప్పారు. కేసీఆర్ పాలన దేశ ప్రజలు కోరుకుంటున్నారని, దేశంలోని వివిధ రాష్ట్రాలలో బీఆర్ఎస్‌కు మంచి మద్దతు లభిస్తుందని ఆయన వివరించారు. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఈనెల 17న గిరిజన దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇందులో భాగంగా ఆమనగల్లులో రూ. 2 కోట్లతో నిర్మించే గిరిజన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నట్లు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ చెప్పారు. సమావేశంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రామేశ్వరీదేవి, ఆర్డీఓ సూరజ్‌కుమార్, తహసీల్దార్ జ్యోతి, జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు పత్యానాయక్ పాల్గొన్నారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని..

భర్త ఆత్మహత్య


మల్లేశ్ (ఫైల్)

మొయినాబాద్: భార్య పుట్టింటికి వెళ్లడంతో మనస్తాపం చెందిన భర్త ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మొయినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కేతిరెడ్డిపల్లికి చెందిన కావలి మల్లేశ్ (27) చేవెళ్ల మండలం గుండాలకు చెందిన శృతితో 2020లో పెళ్లి జరిగింది. వీరికి రెండేళ్ల బాబు ఉన్నాడు. ప్రస్తుతం శృతి గర్భవతి. అనారోగ్యానికి గురి కావడంతో ఈ నెల 9న ఆస్పత్రికి వెళ్లింది. ఆస్పత్రిలో చూపించుకుని పుట్టింటికి వెళ్లి అక్కడే ఉంటోంది. గురువారం సాయంత్రం మల్లేశ్ భార్యతో ఫోన్‌లో మాట్లాడాడు. ఇంటికి రాకుండా తన భార్య పుట్టింటిలోనే ఉందని మనస్తాపం చెంది రాత్రి వేళ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శుక్రవారం ఉదయం చుట్టుపక్కల వాళ్లు గమనించి భార్యకు, పోలీసులకు చెప్పారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

గోవులను తరలిస్తున్న ముఠా అరెస్టు


పోలీసులు సంరక్షించిన గోవులు

అబ్దుల్లాపూర్‌మెట్: పశువులను అక్రమంగా గోవధకు తరలిస్తున్న 13 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 83 ఆవులు, 103 ఎద్దులు, 11 లేగదూడలను సంరక్షించి వాటిని గోశాలకు తరలించి, నింధితులను రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ మన్మోహన్ తెలిపిన వివరాల ప్రకారం... పశువులు, ఆవులు, ఎద్దులు అక్రమ రవాణా నివారించడానికి వారం రోజులుగా అబ్దుల్లాపూర్ మెట్ పోలీసు స్టేషన్ పరిధిలోని కొత్తగూడెం కూడలి వద్ద చెక్ పోస్ట్ ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు పశువులు, అక్రమ రవాణా చేస్తున్న 13మందిపై 5 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఎలాంటి అనుమతు లేకుండా ఆవులను తరలిస్తున్న 5 వాహనాలను సీజ్ చేసి, నిందితులను మేజిస్ట్రేట్ ముందు హాజరు పర్చగా రిమాండ్ విధించారన్నారు.

సబ్సిడీ యూరియా పట్టివేత

వాహనం సీజ్


పట్టుబడిన వాహనంలో యూరియా బస్తాలు

కేశంపేట: రైతులకు సబ్సిడీపై అందించాల్సిన యూరియాను అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకోని కేసు నమోదు చేశారు. ఈ ఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. మండల కేంద్రంలో కానిస్టేబుల్ రవి, హోంగార్డు రవి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. బొలెరో వాహనంలో యూరియా తరలిస్తుండగా గమనించి పట్టుకున్నారు. వాహనంలో 45 కిలోల యూరియా బస్తాలు 60 ఉన్నట్టు వారు తెలిపారు. యూరియాకు సంబంధిన సరైన పత్రాలు లేవని కేశంపేటలోని ఆగ్రో రైతు సేవా కేంద్రం నుంచి చేవెళ్ల దగ్గరలోని ఓ పరిశ్రమకు తరలిస్తున్నట్ట డ్రైవర్ మల్లేశ్ తెలిపినట్టు వారు తెలిపారు. ఆగ్రోరైతుసేవ కేంద్రంలో సూపర్‌వైజర్‌గా ఉన్న మంచె శ్రీశైలం ఈ యూరియా బస్తాలను తరలించినట్టు వారు తెలిపారు. వాహనాన్ని సీజ్ చేసి ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్టు హెడ్ కానిస్టేబుల్ పాండయ్య తెలిపారు.

ట్రాక్టర్, కారు ఢీ

ముగ్గురికి గాయాలు


ప్రమాదస్థలంలో కారు


దెబ్బతిన్న ట్రాక్టర్ ముందుభాగం

కద్తాల్: మండల పరిధిలోని రావిచేడ్ గ్రామ సమీపంలో శుక్రవారం సాయంత్రం, ప్రమాదవశాత్తు ట్రాక్టర్, కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. షాద్‌నగర్ సమీపంలోని హాజీపూర్‌కు చెందిన ఆంజనేయులు, డ్రైవర్‌తో కలిసి వ్యక్తి గత పనిమీద కారులో కద్తాల్‌కు వచ్చారు. తిరిగి వెళ్తుండగా మార్గమధ్యంలో రావిచేడ్ గ్రామ సమీపంలో నీటి ట్యాంకర్‌తో కూడిన ట్రాక్టర్ అకస్మాత్తుగా రోడ్డుపైకి రావడంతో ఢీకొన్నాయి. ఈ ఘటనలో ట్రాక్టర్ ముందు భాగం బాగా దెబ్బతిన్నది. ట్రాక్టర్ డ్రైవర్‌తోపాటు, కారులో ప్రయాణిస్తున్న ఆంజనేయులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు సేకరించారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక..

వ్యక్తి ఆత్మహత్య


సుదర్శన్‌రెడ్డి (ఫైల్)

చేవెళ్ల: ఆర్థిక ఇబ్బందులు తాళలేక పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవునిఎర్రవల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దేవునిఎర్రవల్లికి చెందిన సి.సుదర్శన్‌రెడ్డి (35) ఆటో నడిపించుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల ఆటో రిపేర్‌కు వచ్చి ఇంటి వద్దనే ఉంటున్నాడు. చేతులో డబ్బులు లేకపోవటంతో అప్పుకోసం ప్రయత్నించాడు. అప్పు దొరకకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందాడు. శుక్రవారం ఉదయం ఇంటివద్దనే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పట్టణ ప్రగతితో గణనీయమైన మార్పు


మహిళా సంఘాల సభ్యులకు చెక్కును అందజేస్తున్న అదనపు కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

• అదనపు కలెక్టర్ ప్రతీక్ జైన్

షాద్‌నగర్: పట్టణ ప్రగతితో గణనీయమైన అభివృద్ధి సాధించామని అదనపు కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం షాద్‌నగర్ మున్సిపాలిటీలో నిర్వహించిన పట్టణ ప్రగతి కార్యక్రమానికి ప్రతీక్ జైన్, ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తు తరాలకు మంచి వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని యుద్ధంలా చేపట్టిందని అన్నారు. పల్లెలు, పట్టణాలు తేడా లేకుండా భారీ స్థాయిలో మొక్కలు పెంచినట్టు చెప్పారు. పట్టణ ప్రగతి ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కరించినట్టు తెలిపారు. ప్రజల కనీస మౌలిక సదుపాయాలైన సీసీ రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ దీపాల ఏర్పాటు, అంతర్గత కాల్వల నిర్మాణం వంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం కావాల్సినన్ని నిధులు మంజూరు చేసిందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పారిశుద్ధ్య కార్మికులకు ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పారిశుద్ధ్య కార్మికులను వేతనాలు పెంచినట్లు చెప్పారు. మహిళల ఆర్థిక పురోభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని, మహిళా సంఘాలకు ప్రత్యేకంగా రుణాలు అందజేసి స్వయం ఉపాధి పొందేందుకు ప్రోత్సహిస్తోందని ఆయన వివరించారు. అనంతరం మహిళా సంఘాలకు రూ.50 లక్షల చెక్కును అందజేశారు. పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, వైస్ చైర్మన్ నట్‌రాజన్, అగ్గనూరు విశ్వం, కమిషనర్ వెంకన్న, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.